
14వ వార్డులోని సచివాలయం

# 'సచివాలయం'.. నిర్వీర్యం


పని చేయని ప్రింటర్

- పని చేయని ప్రింటర్లు కుల,ఆదాయ ధ్రువపత్రాలకు తీవ్ర ఇబ్బందులు
- వార్డు వలంటీర్లు లేకపోవడంతో సేవలు గగనం

**సీతమ్మధార :** గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. వలంటీర్లను నియమించి ప్రజలకు మెరుగైన సేవలందించింది. ఏ సమస్య వచ్చినా మేమున్నామంటూ వార్డు వలంటీర్ల ఇంటికొచ్చి మరీ సమస్య పరిష్కరించేవాళ్లు. వాట్సప్ గ్రూపుల ద్వారా ప్రభుత్వ పథకాలు, ధ్రువపత్రాల సమాచారం..విద్య,వైద్య, ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అప్డేట్ ఇచ్చేవాళ్లు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇవన్నీ కనుమరగయ్యాయి. సచివాలయ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యమైంది. వార్డు వలంటీర్ల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ప్రజలకు ప్రభుత్వ సేవలు గగనమయ్యాయి.

**సచివాలయాల్లో స్టేషనరీ లేక కార్యదర్శులకు చేతి** చమురు వదులుతోంది. అలాగే ప్రింటర్లు పనిచేయకపోవడంతో కుల, ఆదాయం, ఫ్యామిలీ సర్టిఫికెట్లను ఇవ్వలేకపోతున్నారు. బయట ప్రింట్ తీసుకోవాలని నచ్చచెప్పే పరిస్థితి వచ్చింది అడ్మిన్లు చెబుతున్నారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలోని పాత రేసపువానిపాలెం, నక్కవానిపాలెం,అల్లూరి సీతారామరాజు జంక్షన్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, సీతమ్మధార మెయిన్‌రోడ్డు, గణేష్‌నగర్, తదితర ప్రాంతాలలో సచివాలయాలు వున్నాయి.

**వలంటీర్ వాట్సప్ గ్రూపుల రద్దు**
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరాగానే వార్డు వలంటీర్ వాట్సప్ గ్రూపులన్నీ రద్దు చేసింది. దీంతో ప్రజలు పారిశుధ్యం, వీధిలైట్లు, కుక్కల బెడద, డెబ్రిస్, అక్రమ కట్టడాలకు సంబంధించి ఫిర్యాదులు చేయడానికి వేదిక కరువైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వార్డు వలంటీర్ గ్రూపులో ప్రజలు పోస్టు చేసిన ఫిర్యాదులను సదరు వలంటీర్ సచివాలయం కార్యదర్శులకు ఫార్వర్డ్ చేసేవారు. వారు సంబంధిత జోనల్ కార్యాలయం అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారం చేసేవారు. ఇప్పుడు వలంటీర్లు లేరు, వాట్సప్ గ్రూపులు లేవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వార్డు వలంటీర్లకు రూ.5వేల నుంచి రూ.10వేలకు వేతనాలు పెంచుతామని బూటకపు హామీలు ఇవ్వడం తెలిసిందే. వేతనం పెంపు సంగతి దేవుడెరుగు, ఉన్న ఉద్యోగాలే ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పనిభారం**
కార్యదర్శుల మీద పనిభారం పెరిగిపోతోందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. సచివాలయం కార్యదర్శుల ఖాళీలు భర్తీ కావడం లేదు. దీంతో వున్న కార్యదర్శులపై తీవ్ర పనిభారం పడుతోంది. వార్డు వలంటీర్లు లేకపోవడంతో కార్యదర్శులే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇవ్వాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి చికిత్స పొందుతున్న రోగుల దగ్గరకు వెళ్లి మరీ పింఛన్లు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితి లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వలురకాల ప్రభుత్వ సర్వేలు అప్పగించడంతో వీధుల్లోనే రోజంతా తిరగాల్సిన దుస్థితి నెలకొందని కార్యదర్శులు వాపోతున్నారు.


24 వార్డు నక్కవానిపాలెంలోని సచివాలయం

## కేకే రాజుతో పలువురి భేటీ


ఉత్తర సమన్వయకర్త కేకే రాజును సత్కరిస్తున్న హరిపట్నాయక్, సతీష్

**సీతమ్మధార :** ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడి నల్లబోతుల సతీష్, మేధావుల ఫోరం అధ్యక్షుడిగా హరిపట్నాయక్ నియమితులుకావడంతో ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కేకే రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో 45 వార్డు అధ్యక్షుడు పైడి రమణ, వార్డు నాయకులు నాని బాబు, గణపతి, ముప్పిడి రామారావు, నారాయణ, దయ, శంకర్ పాల్గొన్నారు.

## త్రిముఖ విఘ్నేశ్వర ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

**సీతమ్మధార :** జీవీఎంసీ పరిధి 14వ వార్డు నరసింహనగర్ దరి గణేష్ నగర్‌లోని శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో మాఘమాస పూజా మహోత్సవాలు గత నెల 30 నుంచి నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ టీ.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం అభిషేకాలు, సూర్యనమస్కారాలు నిర్వహించనున్నామని, 4న రథసప్తమి సందర్భంగా సూర్యనారాయణస్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు.

## క్లుప్తంగా

### బాలబాలికల వైద్యం కోసం ప్రత్యేక వాహనం


వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

**మహారాణిపేట :** రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా బాలబాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి సత్వర చికిత్స అందించేందుకు ప్రవేశ పెట్టిన ప్రత్యేక వాహనాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. 0–19 ఏళ్లలోపు బాలికల్లో పుట్టుకతో వచ్చే లోపాలతో బాధపడుతున్నవారిని గుర్తించి, వైద్య సేవలందించనున్నారు. ఆరోగ్య కేంద్రాల నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ)కు తరలించే నిమిత్తం ఈ ప్రత్యేక వాహన సదుపాయం కల్పించామన్నారు. ముందుగా నిర్ణయించిన నిర్ణీత సమయాల్లో ఆయా ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి అక్కడ వైద్యాధికారులు నిర్ధారించిన బాలబాలికలను డీఈఐసీ సెంటర్‌కు తరలిస్తుంది. కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య జిల్లా సమన్వయకర్త డాక్టర్ బి.హారిక, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డీమో) బి.నాగేశ్వరరావు, ఇ.శాంతిప్రియ, డీఈఐసీ మేనేజర్ మోహన్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### 4న టీటీడీ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు

**ఎంవీపీకాలనీ:** హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 4వ తేదీన రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, డీపీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా ఈ వేడుకలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన బ్యానర్‌ను శనివారం ఎంవీపీ కాలనీలోని డీపీపీ కార్యాలయంలో డీపీపీ అధికారులు ఆవిష్కరించారు. 4వ తేదీ ఉదయం అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి పాడేరు విజ్ఞాన భారతి స్కూల్‌లోను, విశాఖ జిల్లాకు సంబంధించి మురళీనగర్, వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లోను, అనకాపల్లి జిల్లాకు సంబంధించి సబ్బవరం శ్రీసాయికృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లోను ఈ వేడుకలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీపీ క్లస్టర్ సూపరింటిండెంట్ ఎం.కాంతికుమార్, ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యనారాయణ, పి.సత్యకుమార్, ఎంకేవీవీ సత్యనారాయణ, వీవీ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

### క్యాన్సర్‌పై అవగాహన సదస్సు రేపు

**మురళీనగర్:** మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంల ఓమ్ని ఆస్పత్రి సహకారంతో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి, కార్యదర్శి పి.ప్రమీల తెలిపారు. ఈ మేరకు ఆరోజు సాయంత్రం 4నుంచి 6గంటల వరకు ఈస్టు పార్కులో నిర్వహించే క్లబ్ నెలవారి సమావేశంలో ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ సౌదామని ముఖ్య అతిథిగా పాల్గొని క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై మహిళలకు అవగాహన కల్పిస్తారన్నారు. మురళీనగర్, మాధవధార జంటకాలనీల మహిళలు పాల్గొనాలని ఆమె కోరారు.

### ప్రాణం తీసిన అతి వేగం

- యువకుడు మృతి
- మరొకరికి గాయాలు

**కొమ్మాది:** భీమిలి బీచ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపిన వివరాలివి.. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం కొత్యాడ గ్రామానికి చెందిన ముమ్మాని ప్రదీప్, స్నేహితుడు లోకేష్ మూడు సంవత్సరాలుగా చిప్పాడలోని దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, కంపెనీ క్వార్టర్స్‌లో ఉంటున్నారు. వారు శుక్రవారం సాయంత్రం వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై వైజాగ్ వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి తిరిగి వస్తుండగా చిప్పాడ వద్ద ఎర్రమట్టిదిబ్బల సమీపంలో మార్లిన్‌కేఫ్ మలుపు వద్ద వారి ద్విచక్ర వాహనం అదుపు తప్పి, బోల్తాపడింది. ఈ ఘటనలో ప్రదీప్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సహాయంతో హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. రక్త స్రావం ఎక్కువ కావడంతో అప్పటికే ప్రదీప్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెనుక కూర్చున్న లోకేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం లోకేష్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతి వేగంతో రావడం వలన వాహనం అదుపు తప్పి, ప్రమాదానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ప్రదీప్ తండ్రి రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

## పదో తరగతి విద్యార్థులపై శ్రద్ధ అవసరం


విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమైన ఎంఈవోలు

**సీతంపేట:** పదో తరగతి విద్యార్థులను చదివించడంలో తల్లిదండ్రులు కూడా కీలకంగా వ్యవహరించాలని సీతమ్మధార మండల ఎంఈవోలు రామారావు, బాలామణి పేర్కొన్నారు. 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో పదో తరగతి కీలకమైనదని, ఉత్తీర్ణత సాధించేలా పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నరని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు సైతం తమ పిల్లలు ఇంటి వద్ద చదివేలా, క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులు చదవును పక్కన బెట్టి సెల్‌ఫోన్‌లో గేమ్స్, టీవీలతో కాలక్షేపం చేస్తున్నారని, విద్యార్థి చదువు, మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. తమ పిల్లలు ఎలా చదువుతున్నారు, వారి ప్రవర్తన, నడవడికపై నిత్యం ఉపాధ్యాయులతో మాట్లాడి తెలుసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీ నరస మాట్లాడుతూ మార్చి 17 నుంచి జరగనున్న టెన్త్ పరీక్షల్లో తమ పాఠశాల నుంచి 122 మంది హాజరు కానున్నట్టు తెలిపారు. గత ఏడాది పదో తరగతి ఉత్తీర్ణతా శాతం 81 ఉందని, ఈ ఏడాది అంతకు మించి సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వంగల అప్పలరాజు, ఉపాధ్యాయులు నిర్మల, జ్యోతి, రామలక్ష్మి, సునంద్, ధర్మారావు, విశ్వనాథం పాల్గొన్నారు.

## ఒరిగిపోయిన చెట్టుతో పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డుపైకి ఒరిగిపోయిన చెట్టు

**సీతమ్మధార :** జీవీఎంసీ పరిధిలోని 14వ వార్డు బాలయ్యశాస్త్రి లే అవుట్ రోడ్డులో ఒక చెట్టు పాదచారులు, వాహనచోదకులను భయాందోళనకు గురిచేస్తోంది. ఇక్కడి మోర్ షోరూం మార్గంలో ఓ అపార్ట్‌మెంట్ ఆవరణలో గల చెట్టు ఏటవాలుగా రోడ్డుపైకి వాలిపోయింది. ఏ క్షణాన కూలుపోతుందోనని ఈ మార్గంలో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు హడలిపోతున్నారు. విద్యుత్ స్తంభంపైకి కూడా చెట్టు ఒరిగిపోవడంతో గాలివాన సమయంలో నిప్పురవ్వలు పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

## నేడు వ్యాకులమాత మహోత్సవం


కాలినడకన సాగిపోతున్న భక్తులు

**కంచరపాలెం:** విశాఖ అతి మేత్రాసనం, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్తవలస కొండ దాబాలకు చెందిన వ్యాకుల మాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 2 ఆదివారం జరగనున్న పాప పశ్చాత్తాప ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో కొండ దాబాల వద్ద సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురంలో శనివారం ఉదయం 8 గంటలకు సెయింట్ పీటర్స్ విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ దివ్యపూజా బలి నిర్వహించారు.

**పాప పశ్చాత్తాప పాదయాత్ర..**
జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన చర్చి నుంచి శనివారం ఉదయం పాప పశ్చాత్తాప పాదయాత్ర చేపట్టారు. కాలి నడకన వేల సంఖ్యలో భక్తులు మేరీమాతను స్మరిస్తూ జ్ఞానాపురం నుంచి పాదయాత్ర చేశారు. మార్గమధ్యలో పలువు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు స్నాక్స్, ఉచిత భోజనం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించారు. ఆదివారం జరిగే ఉత్సవానికి పరిసర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సిటీ బస్సులు ఏర్పాటు చేసింది.


పాదయాత్రను ప్రారంభిస్తున్న రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్

## సర్వీస్ రోడ్డులో ఆక్రమణలు


గురుద్వారా వద్ద సర్వీస్ రోడ్డులో ఆటోల మరమ్మతులు


సర్వీస్ రోడ్డులో భవన నిర్మాణ సామగ్రి నిల్వలు

**సీతంపేట:** పదిమంది రాకపోకలకు అనువుగా ఏర్పాటు చేసిన సర్వీస్ రోడ్లు ఆక్రమణలతో వ్యాపార కేంద్రాలుగా మారిపోయాయి. జీవీఎంసీ 25వ వార్డు గురుద్వారా కూడలి వద్ద పాత పెట్రోల్ బంకు వద్ద సర్వీస్ రోడ్డు మొత్తం ఆక్రమణలకు గురైంది. గురుద్వారా కూడలి నుంచి పాతపెట్రోల్ బంకు మీదుగా గణేష్‌నగర్, గొల్లవీధి, సీతంపేట గ్రామంలోకి వాహనాలు సులువుగా రాకపోకలు సాగించడానికి వీలుగా సర్వీస్ రోడ్డు ఉపయోగపడుతోంది. అయితే ఈ మార్గం పూర్తిగా మెకానిక్ షెడ్లు, వాహనాల టింకరింగ్, పెయింటింగ్, ఆటోల మరమ్మతులకు కేంద్రంగా మారిపోయింది. కొంతమంది సర్వీస్ రోడ్డును ఆక్రమించి భవన నిర్మాణ సామగ్రి విక్రయిస్తున్నారు. దీంతో రహదారి ఆక్రమణలతో ఆ మార్గంలో ప్రయాణించడానికి వాహనచోధకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పందించి సర్వీస్‌రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

## వైభవంగా సుప్రభాత సేవ

**మురళీనగర్:** కప్పరాడ ఎన్జీజీఓస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## బజార్ బయట వ్యాపారాలతో ఇక్కట్లు


అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద రోడ్డు కిరువైపులా ఆక్రమణలు

**సీతంపేట:** జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద జీవీఎంసీ సుమారు రూ. 50 లక్షల వ్యయంతో చిరువ్యాపారులకు కూరగాయలు, చేపల విక్రయానికి బజారు నిర్మించింది. అయితే బజారులోకి వినియోగదారులు సరిగా రావడం లేదని కొంతమంది వ్యాపారులు బజారు బయట రోడ్డు మీద విక్రయాలు జరుపుతున్నారు. తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసుకుని సుమారు 6 అడుగుల రహదారి ఆక్రమించి మరీ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రహదారికి రెండో వైపు వాహనాలు నిలిపివేస్తుండటంతో ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకునే వీలులేక ఇబ్బంది పలువురు పడుతున్నారు. బజార్ లోపల స్టాల్స్ ఖాళీగా దర్శనమిస్తుంటే రోడ్డును ఆక్రమించి వ్యాపారాలేంటని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## పేదలకు చీరలు, దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాష్ట్ర దళిత నాయకుడు గొల్లమాల అప్పారావు

**కంచరపాలెం:** జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధిలో రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం పేదలకు అన్నదానం, మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు చేతులు మీదుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 150 మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ఆర్ వెంకటరావు, బి.బి.మూర్తి, బి.అప్పారావు, ఎన్ గణేష్, కె.నరసింగరావు, ఎన్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్టడీ సర్కిల్‌లో వీవీవైఎం పుస్తక పఠనం

**మురళీనగర్:** మురళీనగర్ సెక్టార్–3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో విశాఖ వివేకానంద యువ మహామండలి ఆధ్వర్యంలో యువకులతో పుస్తక పఠనం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు పార్కు ఉపాధ్యక్షుడు జి.వెంకట రత్నం తెలిపారు. ముందుగా వివేకానందుడు, రామకృష్ణ పరమహంసకు పూజలు చేసిన అనంతరం నగరంలోని యువతతో సమావేశం ఏర్పాటు చేసి వివేకానందుడి బోధనలపై అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం పార్కులోని వివేనాంద గ్రంథాలయంలో వివేకానందుడి రచనలపై పుస్తక పఠనం ఉంటుందని యువకులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## పరాజయమే విజయానికి సోపానం

- అలాంటి వారి జీవితాలే పాఠాలు
- ఐఐఎంవీ ఈ–సమ్మిట్‌లో వక్తలు


చర్చలో పాల్గొన్న ప్రముఖులు

**తగరపువలస:** పరాజయాలను సోపానాలుగా చేసిన విజయం సాధించిన వ్యవస్థాపకుల జీవితాలను పాఠాలుగా నేర్చుకోవాలని టాక్సీ ఫోర్ ష్యూర్‌కు చెందిన అప్రమేయ రాధాకృష్ణ, ఫ్యాబ్ మార్ట్ అండ్ ఇండియా ప్లాజా వ్యవస్థాపకుడు కె.వైతీశ్వరన్ అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో శనివారం జరిగిన ఇన్నోవేటర్లు, వ్యవస్థాపకులు, స్టార్టప్‌ల కలయికలో జరిగిన పరివర్తనాత్మక ఈ–సమ్మిట్‌లో వారు మాట్లాడారు. ప్రొఫెసర్ షమీమ్ జావేద్ ప్రారంభోత్సవ ప్రసంగం చేశారు. కీలకమైన వాటాదారుల మధ్య సహకారం, నేర్చుకోవడం, నెట్‌వర్కింగ్‌ను పెంపొందించుకోవడం ద్వారా స్ఫూర్తిదాయకంగా ఈవెంట్ ప్రారంభమైనట్లు తెలిపారు. పీర్ క్యాపిటల్ మేనేజింగ్ పార్ట్‌నర్ కార్తీక్ ప్రభాకర్ క్రాఫ్టింగ్, నేరేటివ్స్, స్టోరీ టెల్లింగ్స్ టు బిల్డ్ స్టార్టప్ బ్రాండ్స్ అనే అంశాలపై కీలక ఉపన్యాసం చేశారు. ఒక వెంచర్ ప్రారంభించేటప్పుడు స్పష్టమైన ఉద్దేశం కలిగి ఉండవలసిన ప్రాముఖ్యత గురించి వివరించారు. ఏపీవాల్ట్ 2.0లో దేశవ్యాప్తంగా పాల్గొన్న 50కు పైగా జట్ల నుంచి ముగ్గురిని విజేతలుగా ప్రకటించారు. ఈ సమ్మిట్‌లో స్టార్టప్ వ్యవస్థాపకులు, ఎంఎస్ వ్యవస్థాపకులు, ప్రతినిధులు 500 మందికి పైగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సూనీకార్న్ వెంచర్స్ సహ వ్యవస్థాపకుడు విజయసింగ్ రాథోడ్, ఎండ్యూరెన్స్ క్యాపిటల్ మేనేజింగ్ పార్టనర్ సిద్ధార్థ సిరిగెరి, ఐఐఎంవీ ఫీల్డ్ సీఈవో గుహేష్ రామనాధన్ మాట్లాడారు.

# పగలే వెన్నెల..!


మద్దిలపాలేనికి వచ్చే మార్గంలో ఉదయం పూట వెలుగుతున్న విద్యుత్ దీపం

**సీతమ్మధార :** అతివృష్టి, అనావృష్టి అన్న నానుడి జీవీఎంసీ జోన్–3లో గల పబ్లిక్‌వర్క్స్ విభాగానికి సరిగ్గా అతినట్టు సరిపోతుంది.ఉత్తర నియోజకవర్గం పరిధిలో గల పలు ప్రాంతాల్లో వీధిలైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా దేదీప్యమానంగా వెలగడంతో విద్యుత్ యథేచ్ఛగా వృథా అవుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు ఎల్ఈడీ లైట్లు వాడకం కారణంగా విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గిపోయిందని చెబుతున్న జీవీఎంసీ అధికారులు పగటిపూట అనవసరంగా విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. సత్యం జంక్షన్ నుంచి మద్దిలపాలెంకు వచ్చే మార్గంలో లైట్ పగలు కూడా వెలుగుతోంది, రాత్రి మాత్రం వెలిగే పరిస్థితి లేదు. మోడ్రన్ లైట్లు సాక్షాత్తూ, గత కొద్ది రోజులు క్రితం జీవీఎంసీ అధికారులు ఆదేశించినా సరే సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శులు వీధిలైట్లపై పర్యవేక్షణ చేయడం లేదని తేటతెల్లం అవుతోంది. మద్దిలపాలెం నుంచి గురుద్వారా వెళ్లే జాతీయరహదారిపై సత్యం జంక్షన్ ప్రాంతంలో పది రోజులుగా విద్యుత్ దీపాలు ఉదయం పూట కూడా వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా జోన్–3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## ప్రజాభిప్రాయాన్ని గౌరవించడం పాలకుల ధర్మం

**మధురవాడ:** పాలకులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ప్రజాభిప్రాయానికి గౌరవం ఇవ్వడమే నిజమైన ప్రజాస్వామ్యం అని, అది రామాయణంలో ఎంతో గొప్పగా వివరించారని ప్రవచన పరమేష్టి డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ రామాయణ పవ్రచనాల్లో భాగంగా 8వ రోజు ఆయన అయోధ్యకాండలో పలు ఘట్టాలను వివరించారు. సీతారామ కల్యాణం అనంతరం శ్రీరామునికి యువరాజ పట్టాభిషేకం చేద్దామనుకున్న దశరథ మహారాజు తాను రాజైనప్పటికీ ఏకపక్ష నిర్ణయం చేయకుండా ప్రజాభిప్రాయాన్ని అడిగారని తెలిపారు. అప్పుడు ప్రజలు, భూమి, రుషులు అందరూ శ్రీరాముని యువరాజును చేయమని చెప్పడం ఆయనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలియజేశారు. తాను ఇన్ని వేల సంవత్సరాలు పాలనచేసిన తర్వాత శ్రీరాముడినే ఎందుకు యువరాజుగా కోరుకుంటున్నారని అడిగితే ప్రజలు రాముని యొక్క గుణములను కీర్తించి, ప్రజలందరినీ తల్లిలా ప్రేమిస్తాడని, తండ్రిలా కాపాడతారని చెప్పారన్నారు. రజోగుణ సంపన్నురాలైన కైకమ్మ అసూయాపూరితమైన మంథర మాటలచే ప్రభావితమైందని, అసూయ అందరూ పరిత్యజించాల్సిన చెడ్డ అలవాటని తెలిపారు. ప్రవచనానికి అనేక మంది విద్యార్థులు హాజరయ్యారు.